పారిశుద్ధ్యం.. అధ్వానం

- ఏలూరులో రోడ్ల పక్కనే చెత్త గుట్టలు
- వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని అధికారులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో సైతం చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. విలీనమైన పంచాయతీల్లో పారిశుద్ధ్యం పరిస్థితి మరింత దిగజారింది. అధికారుల పర్యవేక్షణా లోపం, సరిపడా చెత్త తరలించే వాహనాలు లేకపోవడం, సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటంతో చెత్తను వారానికి రెండు సార్లు మాత్రమే తీసే పరిస్థితి విలీన పంచాయతీల్లో కన్పిస్తోంది. దీంతో ప్రధాన రోడ్ల పక్కనే ఇష్టానుసారంగా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పనికిరాని వస్తువులు, వ్యర్థాలను రోడ్లపక్కగా కుప్పలుగా వేసి వదిలివేస్తున్నారు. చెత్త కుప్పల్లో పందులు, పంది కొక్కులు, ఇతర మూగ జీవాలు సంచరిస్తున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించకపోవడంతో నగరంలో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

కొమడవోలులో ఎక్కడి చెత్త అక్కడే

ఏలూరు నగరంలోని విలీన పంచాయతీల్లో ఒకటైన కొమడవోలు ప్రాంతంలో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా మారింది. ఇక్కడ కనీసం చెత్త వేసేందుకు డస్టుబిన్‌లు కూడా లేవు. దీంతో వ్యాపారులు, ప్రజలు చెత్త, వ్యర్థాలను తూర్పులాకుల నుంచి పోతునూరు వరకు ప్రధాన రహదారి పక్కనే పడేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్త ఎక్కువగా ఉందనే కారణంతో కొద్దికొద్దిగా వదిలివేస్తున్నారు. ఈ చెత్తను పందులు, పంది కొక్కులు, ఆవులు వంటివి చిందరవందర చేసి రోడ్డుపైకి లాక్కొచ్చేయడంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. పూర్తిస్థాయిలో చెత్తను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.


కొమడవోలు ప్రాంతంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చెత్త గుట్ట


కొమడవోలు మెయిన్ రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీకి వెళ్లే దారిలో చెత్త గుట్ట

కొరవడిన అజమాయిషీ

గత కొంత కాలంగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, టూటౌన్ ప్రాంతంలో అసిస్టెంట్ కమిషనర్ జి.చంద్రయ్యలు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. అయితే వీరిద్దరూ క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించకపోవడంతో సిబ్బంది వారి ఇష్టానుసారంగా చేసుకుపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో సిబ్బంది సైతం తమకు నచ్చిన విధంగా పనులు చేసుకెళుతున్నారనే వాదనలు ఉన్నాయి.

ముక్కు మూసుకోవాలి



రోజూ మల్కాపురం నుంచి ఏలూరుకు మూడుసార్లు వచ్చి వెళుతుంటాను. ఈ క్రమంలో మల్కాపురానికి ఆనుకుని ఉన్న కొమడవోలు ప్రాంతంలో రోడ్ల పక్కనే చెత్త కుప్పలు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పల నుంచి వ్యర్థాలను రోడ్లపైకి మూగజీవాలు లాక్కుని వస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో రోడ్డుపై ద్విచక్రవాహనంపై వెళ్లినప్పుడల్లా ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుంది.

– వెంపా నాగరాజు, స్థానికుడు, మల్కాపురం

ఆటోల రద్దుతో సమస్య



ఏలూరు కార్పొరేషన్ పరిధిలో క్లాప్ ఆటోల రద్దుతోనే నగరంలో పారిశుద్ధ్య సమస్య అధికమైంది. తొలగించిన వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడమూ ఒక కారణమే. మరో పక్క సాక్షాత్తు డిప్యూటీ కమిషనర్ ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు వన్ టౌన్ ప్రాంతంలో పారిశుద్ధ్యం పడకేయడం మరీ విడ్డూరంగా ఉంది. తక్షణం ఉన్నతాధికారులు పర్యవేక్షించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చాల్సిన అవసరం ఉంది.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

క్లుప్తంగా

లిఖిత పూర్వక ఆదేశాలివ్వాలి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో అనుత్తీర్ణులైన జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవుల్లో రిమెడియల్ తరగతులు నిర్వహించాలని డీఈఓ ఇచ్చిన మౌఖిక ఆదేశాల స్థానంలో లిఖిత పూర్వక ఆదేశాలివ్వాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు శుక్రవారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. రిమెడియల్ తరగతులు నిర్వహించాలంటూ మౌఖిక ఆదేశాల జారీపై గతంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ప్రాతినిధ్యం చేశామని, తమ ప్రాతినిధ్యాన్ని పరిశీలించకుండా డీఈఓ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆ సమయంలో పాఠశాలలో లేని ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల జీతాలు నిలుపుదల చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలివ్వడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి.మోహన్, ఎం ఆదినారాయణ, టి. రామారావు తదితరులున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉర్దూ ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలని కోరుతూ ఆర్‌యూటీఏ (రూట) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జీలాని తన బృందంతో శుక్రవారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రెండో అధికారిక భాష అయిన ఉర్దూను కాపాడాలని, ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలని కోరారు. వేరే యూనియన్ ఉర్దూ పాఠశాలలో తెలుగు విద్యార్థులు ఉన్నారని తెలుగు పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారని, అలాగే తెలుగు స్కూల్స్‌లో కూడా చాలామంది ముస్లిం విద్యార్థులు ఉండడంతో ఉర్దూ పోస్టులు కూడా ఇవ్వాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ ఖలీల్, ఎస్‌డీ సల్మాన్, ఎండీ షఫీ, ఎండీ సిరాజ్, అబ్దుల్ రజాక్, అనీష్ ఫాతిమా తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని రేచర్ల గ్రామంలోని సారా శిబిరాలపై దాడి చేసి ఒక మహిళలను అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారా, అర కేజీ బెల్లం, 250 గ్రాముల మూరియా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

నేటి నుంచి మహా కుంభాభిషేక మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి సవాహ్నిక దీక్షతో శ్రీ పాంచరాత్ర దివ్యాగమోక్త ప్రకారంగా వార్షిక బ్రహ్మోత్సవ, పుష్కరోత్సవ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీత్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి హస్తాలతో 9వ తేదీ ఉదయం 9.45 గంటలకు ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 12న ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామి హస్తాలతో ఉత్సవ మహా పూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, శ్రీ లక్ష్మీ నారాయణ హవనం, రాత్రి స్వామి వారికి పవళింపు సేవ నిర్వహిస్తామని వివరించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి గౌరవ అధ్యక్షునిగా ఎన్నికైన సత్యవాడ దుర్గా ప్రసాద్‌ను అంబికా గ్రూప్ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా ఏలూరులో శుక్రవారం సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (టూటౌన్) : దుకాణాల్లో పనిచేసే వారు, స్వచ్ఛంద సంస్థలు కార్మిక చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో దుకాణాల్లో పనిచేసే వారు, స్వచ్ఛంద సంస్థలకు శుక్రవారం కార్మిక చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, సంస్థలు, కర్మాగారాల్లో బాలలతో పని చేయించరాదని అన్నారు. అక్కడక్కడా ఉన్న బాల కార్మిక వ్యవస్థను సమష్టిగా అరికట్టాలని అన్నారు. దుకాణాలు, సంస్థల్లో పనిచేసే కార్మికులకు పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్మికుల వివరాలను ఈశ్రం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని తద్వారా సంక్షేమ పథకాలను పొందటం సులభతరం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు అన్నారు. కార్యక్రమంలో సహాయ లేబరు అధికారి గోపాలకృష్ణ, రమణ, న్యాయవాది పి.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.


కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

ఘనంగా సాహిత్య కళా ఉత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (స్టాంప్స్ – రిజిస్ట్రేషన్) లంకా వెంకటేశ్వర్లు ఉద్యోగ, సాహిత్య రంగాలకు సమన్యాయం చేశారని వక్తలు ప్రశంసించారు. వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో సాహిత్య కళా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ విభిన్న రంగాల్లో రాణించడం ద్వారా సాహిత్యానికి, జీవితానికి, వ్యక్తిత్వానికి మధ్య ఉన్న సరిహద్దులను వెంకటేశ్వర్లు చెరిపివేశారని కొనియాడారు. ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ సాహితీ లోకానికి, సామాజిక ఉద్యమాలకు వెలుగులిచ్చే రచనలు చేశారన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు మాట్లాడుతూ వృత్తులు, వృత్తి చైతన్యంలో ఆయన సామాజిక చారిత్రక స్పృహ గురించి ప్రస్తావించారు. ప్రముఖ సినీ గేయ కవి రసరాజు, ప్రముఖ సినీ విమర్శకుడు ఎస్‌వీ రామారావు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్తల వ్యాసాలతో ప్రచురించిన 'మట్టి పువ్వైన వేళ' అభినందన సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా లంకా వెంకటేశ్వర్లు, వరలక్ష్మి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కేవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ రాజు, లేళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ధాన్యం కొనుగోలు చేయాలంటూ ధర్నా

దెందులూరు: ధాన్యం కొనుగోలు లక్ష్యం (టార్గెట్) పేరుతో ధాన్యం కొనుగోలు నిలిపివేయడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు, కౌలు రైతులు శుక్రవారం సాయంత్రం ధర్నా చేశారు. ట్రాక్టర్లు, లారీల్లోకి లోడ్ చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. వాతావరణ మార్పులతో రైతుల దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని తెలిపారు. టార్గెట్ పెంచకుండా, గోనె సంచులు ఇవ్వకుండా, రవాణా ఏర్పాటు చేయకపోవడం వంటి చర్యల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని వివరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు బైరెడ్డి లక్ష్మణరావు, తిరుమలశెట్టి లీలా మాధవ రాము, అకిరి నాగరాజు, తోట సత్యనారాయణ, తిరుమల శెట్టి జగదీశ్వరరావు, నిమ్మల వాసు, చిన్ని కృష్ణ, సూరంగుల వెంకటేశ్వరరావు, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.


రైతుసేవా కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ నిరసన

ఏలూరు (టూటౌన్): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ, ఇఫ్టూ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి నుంచి దాదాపు ఇప్పటికీ 400 మందిపైగా ఆదివాసీలను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు పేరుతో కాల్చి చంపిందన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తూట్లు పొడిస్తూ ఆదివాసి బిడ్డలు జీవించే హక్కును కాలరాస్తూ, మావోయిస్టులనే నెపంతో విచారణ పేరుతో ఇళ్ల నుంచి తీసుకెళ్లి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్య భారత దేశంలోని అటవీ ప్రాంతంలో 86 రకాల అటవీ సంపద నిక్షిప్తమై ఉందని, వాటిని ఆదాని, అంబానీలకు కారు చౌకగా కట్టబెట్టడం కోసం ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ కాల్పుల్లో చనిపోయారని కట్టుకథలు అల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ముంగం అప్పారావు, గడసాల రమణ, మీసాల వెంకటరమణ, దూళ్ల వీరి నాయుడు, నవుడు నెహ్రూ బాబు, కాకర్ల శ్రీనివాసరావు, పిచ్చియ్య, కోరాడ అప్పారావు, రాము, బగాధి రమణ, ప్రసాదు, నాగరాజు, ధర్మ, మంగరాజు రాము, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని రేచర్ల గ్రామంలోని సారా శిబిరాలపై దాడి చేసి ఒక మహిళలను అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారా, అరకేజీ బెల్లం, 250 గ్రాముల మూరియా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. 20 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. చింతలపూడి సుప్రీం పేటలోని ఓ మహిళను అరెస్ట్ చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, సారా సరఫరా చేసిన కోటమర్తి బాలకృష్ణపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రేచర్ల, పట్టాయిగూడెం గ్రామాల్లోని సారా శిబిరాలపై దాడి చేసి ఇద్దరు మహిళల నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారని పేర్కొన్నారు.

కనులపండువగా శివ కల్యాణం


శివదేవుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివదేవుని కల్యాణం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. సుముహూర్త సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను వైభవంగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు.

గుగ్గులోతు కృష్ణ సేవలు అజరామరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయుడు గుగ్గులోతు కృష్ణను శుక్రవారం ఏలూరులోని గిరిజన లంబాడా భవనంలో ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం జిల్లా శాఖ, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరావు నాయక్ మాట్లాడుతూ గిరిజన లంబాడా కుటుంబంలో మారుమూల గ్రామం కృష్ణాపురంలో నిరక్షరాస్య కుటుంబంలో జన్మించిన కృష్ణ ఉపాధ్యాయునిగా విద్యారంగంలోనూ అటు సామాజిక రంగంలోనూ ఆధ్యాత్మిక మార్గంలో కూడా స్వచ్ఛందంగా 28 ఏళ్లుగా చేస్తున్న సేవలను కొనియాడారు. సమాజానికి కృష్ణ చేస్తున్న సేవలు అజరామరమన్నారు. కృష్ణకు మరిన్ని పురస్కారాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావతు కీమ్యా నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధారావతు రాజబాబు నాయక్, అయ్యప్ప మాల ధారణ గురు స్వామి డీవీ మల్లేశ్వర రావు, గొలుసు సాంబశివరావు, నామవరం సర్పంచ్ జరబలా వెంకటేశ్వర రావు నాయక్, చింతలపూడి ఎంపీపీ బాణావతు రాంబాబు నాయక్, జిల్లా నాయకులు బోడా బాలా నాయక్, భూక్యా సోములు నాయక్, ధారావతు నాగేశ్వరావు నాయక్, గుగ్గులోతు కృష్ణమూర్తి నాయక్, ఇస్లావతు బాలాజీ నాయక్, మూడు శ్రీరామ్మూర్తి నాయక్ తదితర ప్రముఖులు పాల్గొని కృష్ణను అభినందించారు.


గుగ్గులోతు కృష్ణను సన్మానిస్తున్న నాయకులు

పంటల ఒబ్బిడికి పాట్లు

పోలవరం రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన పంటను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వాతావరణ మార్పులతో ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఏ పూట ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. రోజూ సాయంత్రానికి వాతావరణంలో మార్పు వచ్చి వర్షం పడుతుంది. దీంతో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలను గుట్టలుగా చేర్చి తడవకుండా బరకాలు కప్పుతున్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా మిల్లులకు తరలించేందుకు కొంత జాప్యం జరగడంతో పాటు సంచులు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిచిపోవడంతో శుక్రవారం ఉదయం రోడ్డుపై ఆరబెట్టి బస్తాల్లోకి ఎక్కించుకునే పనులు చేపట్టారు.

గురునాథరావుకు సన్మానం


గురునాథరావును సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పెద్దలు

జంగారెడ్డిగూడెం: మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులుగా నియమితులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులు శుక్రవారం సత్కరించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో చింతలపూడి నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు, సంఘం జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు ఎల్లా శ్రీను, మాజీ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ, మల్లవరపు నాగ పాను, ఉప్పలపు నాగేశ్వరరావు, శిలరపు మంగారావు, వైస్ ప్రెసిడెంట్ తాడి శ్రీను, యూత్ అధ్యక్షులు శిలరపు ప్రశాంత్, నడింపల్లి నాగు ఉన్నారు.

- గురున్నాథరావును వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, ఏలూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, పార్టీ తడికలపూడి సీనియర్ నాయుకులు వెర్రు శ్రీను బాబు, సత్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.
- జంగారెడ్డిగూడెం పట్టణం, మండలానికి చెందిన భావన రుషి, అట్లూరి శ్రీనివాసు, సత్రం వెంకట్రావు, చనమాల రాజేష్ తదితరులు జెట్టిని అభినందించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30-38	చామదుంపలు	54
బెండకాయలు	30	ముల్లక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	34
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	11
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	07
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	32